యాదృచ్ఛికం

క్షణం తండ్రీ కొడుకులు ఒకర్నొకరు అలాగే రెప్పవాల్చకుండా చూసుకున్నారు. ఇద్దరి మనసులు ఆర్ద్రమైనాయి.

విశ్వనాథం వ్రాసిన ఉత్తరం చాలా కలతబెట్టింది రమణను!

మామూలుగా వచ్చే ఉత్తరాల్లా గాకుండా, యింతవరకు తన జీవితాన్ని, కొన్ని సందర్భాల్లో, తన ప్రవర్తనను, మళ్లీ పునరాలోచించుకోమని, ఆ అవసరాన్ని పరోక్షంగా సూచిస్తున్నట్లు అనిపించింది.

అంతదాకా ఎందుకు, క్షణం స్తభీంకృతుడే అయినాడు. ఆ తర్వాత, తన ఆఫీసు, సహ ఉద్యోగులు, యివన్నీ మదిలో మెదిలి, తేరుకుని ఉత్తరం చదవటానికి ఉద్యుక్తుడయ్యాడు.

"....యిదంతా ఎందుకు వ్రాసున్నానంటే కనీసం నీ చర్యవల్ల కలిగే ఫలితం యిన్నాళ్లకు యింత దారుణంగా పరిణమిస్తుందని ఆనాడు నువ్వు అనుకొని ఉండవు. ఆయనైతే రిటైర్డు పోలీసు సూపర్నెంటే లోకానికి. నిజానికి, ఆయనలో యిదివరకటి పులుపు చావలా! గంభీరంగా చూస్తూ, నిండుగా ఉన్న తెల్లని మీసాలు అలా తమాషాగా, షోగ్గా మెలిత్రిప్పుకుంటూ, మీ యింటి వరండాలో ఆయన పచార్లు చేస్తుంటే అదర్పం, ఠీవి, అడుగులు వెయ్యటం యివన్నీ ఆయన ఒకనాటి, వృత్తికి నిదర్శనాలు అయినా ఆవే జ్ఞాపకాలు గూడ!"

ఒక్కసారి రమణ కళ్లముందు తన తండ్రి రూపం మెదిలింది. ఆజానుబాహువైన ఆ మనిషి కళ్లల్లోకి సూటిగా చూస్తే, సూర్యకిరణాలంత వేడి,

వాడి ఉండేవి. మనిషి మాట్లాడినా అలాగే ఉంటుంది. బాగా ఆలోచించి, నిదానించి, మరీ మాట్లాడుతాడు. ఆయన ఒక నిర్ణయాని కొచ్చి, ఆ నిర్ణయం వెలిబుచ్చిం తరవాత దానికి తిరుగంటూ ఉండకూడదు. ఉంటే సహించడు. అది ఆయన మన స్తత్వం! దాన్ని వృత్తిలో చాలా జాగ్రత్తగా కాపాడుకున్నాడు. 'చండప్రచండుడు' అని పదుగురుచేత అనిపించుకున్నాడు. రమణ కీనాటికీ ఒక్క సందేహం అలాగే మిగిలివుంది.

ఆయనకున్న గుణాల్లో ఒక్కటైనా తనకు సంక్రమించిందా? అని.

"....ఆయనకూ, నీకూ పోలికేలేదు. ఏ విషయంలోనూ, ఒక్క దానిలో తప్ప! ఆయన జీవితంలో యింతవరకూ ఏ పనిలోనూ—వృత్తిలో గాని, ప్రవృత్తిలో గాని—అపజయం ఎరుగడు. అలా అందరికీ రోజులు గడుస్తయ్యో అన్నది అనుమానమే. కానీ ఆయనకు అలానే గడిచింది. ఒక్క నీ విషయంలో తప్ప!"

తను ఏం చేశాడు?

రవణ చిన్నప్పటినుంచీ ప్రేమగానే పెంచబడ్డాడు. అందుకు కారణమూ ఉంది.

తల్లి లేదు రవణకు, మూడేళ్లప్పుడు—రవణ తల్లి అకస్మాత్తుగా చనిపోయింది.

అందుకు బాధపడ్డది వెంకటరత్నంగారు మాత్రమే! దానికి కారణమూ ఉంది.

వెంకటరత్నంగారు తనతోపాటు చదివే, ఒక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అందుకు వెంకటరత్నంగారి తండ్రి, తల్లి అంగీకరించక వేరై పోయ్యారు.

వెంకటరత్నంగారు యిలాంటి అవాంతరాలన్నీ వూహించుకునే, జాగ్రత్త పడ్డాడు. నా అన్నవాళ్లు లేని జానకిని తీసుకు వేరే కాపురం పెట్టారు. చదువు మధ్యలో ఆగిపోయింది. కొన్నాళ్లు అలాగే గడిస్తే ఎలా ఉండేదో గానీ, అలా గడవలా!

వెంకటరత్నంగారు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగా సెలక్ట్ అయ్యారు. దాంతో ఆయన ధైర్యంతో పుంజుకుని, జీవితనావను మరింత వేగంగా, శ్రద్ధగా, మెళకువగా నడుప ప్రారంభించారు.

అలా ఎంతోకాలం గడపలా!

జానకీ, చనిపోయింది! అప్పటికి రమణకు మూడేళ్లు!

అన్నిటికీ దూరమై, జీవిత సంగ్రామంలో ముందుకు పోతున్న వెంకటరత్నంగారికి జానకి లేని లోటు తెలిసి ఆయన అంతర్గతంగా జీవచ్ఛవమై పొయ్యారు.

ఆయనకు మిగిలిం దేమిటి?

ఒక్క మూడేళ్ల రమణ!

వాడి కిహ అన్నిటికీ తానేనన్న వూహ కలిగి ఏదో అర్ధ్రత ఆయన్ను ఆవహించింది. కర్కశముగా ప్రవర్తించాల్సిన ఆయన వృత్తిధర్మానికి రమణ పెంపకం ఆటంకమే అయినా, ఆయన బాధపడలా!

పైకి ఎంత గంభీరంగా, దయారహితంగా ఉన్నా, మనస్సుని మాత్రం ప్రేమ, వాత్సల్యం, ఆత్మీయతతో నింపుకున్నారు ఆయన!

రమణ తల్లి లేనివాడు అని ఆయన కనిపిస్తూ ఉండేది, రమణను చూస్తుంటే!

ఆయన ఆ భావం కొడుక్కి కలక్కూడదు అన్న వూహతో తల్లీ, తండ్రీ అన్నీ తానే అయి రమణను పెంచాడు.

అందుకే, ఒకనొక సమయంలో యిద్దరూ తమ తమ పంతాలు నెగ్గించుకోవాలని పట్టు పట్టారు.

ఇన్నాళ్లూ తను పెంచిన తీరును, చూపిన ప్రేమను పూతంగా తీసుకుని తన తెలివితేటలు, ఎదురులేని తన మాటను ప్రయోగించి, తనమాట నెగ్గించుకోవాలని వెంకటరత్నంగారు!

ఒక్కగానొక్క కొడుకుగా ఆయన చూపిన ఆప్యాయత, ప్రేమ ఆధారంగా, తన మాట నెగ్గించుకోవాలని రమణ ప్రయత్నించాడు.

"అదీ అంత విపరీతంగా పరిణమించేది కూడా కాదు. ఇద్దరిలో ఎవరైనా మెలకువ చూపినట్లయితే! కానీ యిద్దరికి అదే కొరవడింది. ఈమధ్య ఒకసారి ఆయనతో మాట్లాడుతుంటే ఆయన అన్నాడు మాటల సందర్భంలో,

విశ్వనాథం! మావాడు నిజంగా, దయలేనివాడయ్యా! కాకపోతే, ఇన్నాళ్లయింది, ఒక్కసారన్నా నా యోగక్షేమాలు, ఎలా ఉన్నాను ఏమన్నా ఆలోచించాడా! తండ్రన్నమాటే వాడికి జ్ఞాపకం లేకుండా పోయింది.

బొటబొటా కళ్ల నీళ్లు జారినయ్.

"అప్పుడు ఆయనను బాగా పరిశీలించా! నిజంగా ఆయన హృదయం, మారిందా, అందులో నిజాయితీ ఉన్నదా అని!

మీరైనా వెళ్లి వస్తే బాగుండేది! ఎంతైనా కొడుకు గదూ?

నేనా ?

ఏం? మీరే! మీరు పోతే వాడు మట్టుకు మారడంటారా? నేను ప్రశ్నించా.

నమ్మక మేమిటి ?

"ఆ ప్రశ్నకు నే నిజంగా ఆశ్చర్యపోయినాను. ఇన్నాళ్లనించీ ఆయనకు

నీ మీద గల అభిప్రాయంలో నిన్ను నమ్మటానికి సంశయిస్తున్నాడంటే ఆశ్చ ర్యపడక చేసేదేముంది!

ఏం? ఎందుకు మారడు? వాడికి మాత్రం తండ్రిని, తన వున్నతికి కారణభూతుడనీ, తెలియదా? వాడికి మాత్రం మీ మీద ప్రేమ లేకుండా ఉం టుందా! ఏదో ఆవేశంలో అలా వెళ్లిపోయాడే గానీ!

అంతేనంటావా?

అక్షరాలా పెద్దవాళ్లు, మీరే చొరవ తీసుకుని ఏమి జరగనట్లు అన్ని మర్చి పోవాలి గానీ, వాడితో మీకు పంత మేమిటండీ!

అంటే! అంటే!.... అయితే రేపు వెళ్తాను! ఏమంటావు? తండ్రీ కొడుకుల మధ్య తగూలేమిటి?

తప్పకుండా వెళ్లండి.

అలాగే వెళ్తాను. రేపే పోతాను.... నీవు గూడా రారాదూ!

"ఎలాగైనా మీ యిద్దరి మధ్య ఈ సమయంలోనైనా సయోధ్య కూర్చా లని, ఇదే అదను అని నిశ్చయించుకుని, అలాగే! వాడ్ని చూసి గూడ చాలా రోజులైంది. ఎలాగైనా చూసినట్లవుతుంది అని అన్నాను.

ఆయితే యింకేం, రేపు ఏడింటికల్లా రా! ఎనిమిది గంటల బండికి వెడ దాం! నేనీ లోపల అక్కడికి తీసుకెళ్లాల్సిన సామాన్లు అన్నీ సిద్ధం చేయి స్తాను.

అలా మీ యిద్దరి మధ్య సన్నిహితత్వం కలుపుదామని ఆశించాను.

కానీ సాధ్యపడలా!

నే రాను విశ్వనాథం! అన్నాడు మీ నాన్న మర్నాడు, నే వెళ్లేసరికి ప్రయాణమై!

ఏం? ఎందుకు రారు? ఏం జరిగింది? ఆత్రంగా అడిగాను.

ఏముంది జరగటానికి? యింతవరకూ జరిగింది చాలదూ! యింకా ఏం జరగాలి? నన్నూ, నా మాటను కాదని, ఎగర్తించి వెళ్లాడే! అట్లాంటివాడి దగ్గరకు ఏ మొహం పెట్టుకు వెళ్లేది? నేను మట్టుకు మనిషినిగానూ! నాకు మట్టుకు మానాభిమానాలు లేవూ? వస్తే ఏనాటికైనా వాడే రావాలి! అంతే! నే మాత్రం పొయ్యేది లేదు.

"ఇలా అన్నాడు మీ నాన్న! కానీ, ఒక్కటి, ఎంత దాచుకోవాలనుకున్నా, ఆయనలో, మమతకు, అభిమానానికి మధ్య తీవ్రంగా సంఘర్షణ చెలరేగుతున్నది.

విశ్వనాథం! రాత్రంతా నిద్రపోలా! ఏమిటో ఆలోచిస్తూ, గొణుక్కుంటూనే తిరుగుతున్నారు, రాత్రి సరిగ్గా భోజనం గూడ చెయ్యలా!

ఆయనటు వెళ్లింతరువాత నరసమ్మ వచ్చి చెప్పిందీ సంగతి. ప్రస్తుతం నరసమ్మే ఆయనకు వండి, యిల్లు చక్కదిద్దుతున్నది.

నర్సమ్మ!

రమణ ఆమెను పిన్నమ్మా అని పిలుస్తాడు. అలా అని ఆమెకు, రమణకూ బంధుత్వ మేంలేదు అనుబంధం తప్ప! చిన్నప్పుడు రమణను ఆమె పెంచింది. ఆమె ఎవరో, ఏమిటో ఈ నాటికి రమణకు తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నించనూ లేదు. ఇష్టమైనప్పుడు ఉంటుంది కానప్పుడు అంతర్ధాన మవుతుంది. ఉన్నప్పుడు మాత్రం ఆ ఇంటికి ఆమె సర్వాధికారిణి.

ఆయనలో జరుగుతున్న అంతః సంఘర్షణ రానురాను తీవ్ర మవుతున్నది. ఎప్పుడన్నా వీలుచేసుకుని ఆయన దగ్గరకు వెళ్తున్నా! ఒక్కోసారి ఉన్న స్థితిలో మరోసారి ఉండటంలా! ఆ మధ్య ఒకసారి వెళ్తే యింట్లో లేడు. నర్సమ్మే ఉంది.

ఎక్కడికి వెళ్లాడని అడిగా.

గుళ్లో కి.

ని జ మా!

ఇలారా! అని వెంట తీసుకుపోయింది.

"మేడమీద గదిలోకి వెళ్లాం. అక్కడ మీ అమ్మ పెద్ద ఫోటో ఉంది గదూ! ఆ పటాన్ని బాగుచేయించి చుట్టూతా చిన్న చిన్న ఎలక్ట్రిక్ లైట్లు పెట్టి ఉన్నాయి. ఓ పూలమాల, పటం ముందు అగరుబత్తీ వెలిగించినవి ఉన్నాయి. ఇంకా కుంకుమ, పసుపు యివన్నీ గూడా ఉన్నాయి.

"నాకేమీ అర్థంగాలా!"

"క్రింద వంట గది, ప్రక్కనున్న గదిలో ఇనప్పెట్టె ఉన్నదాంట్లో, పూజామందిరం ఏర్పాటైంది. అందంగా ఉన్న ఓ కొయ్యమందిరం, అందులో సీతారామలక్ష్మణ ఆంజనేయ సహిత విగ్రహాలూ, ఇంకా లక్ష్మీదేవి, వెంక టేశ్వరస్వామి, బ్రహ్మంగారి పటమూ యివన్నీ ఉన్నయ్! పైన దణ్ణెముకు పట్టుబట్ట ఆరేసి ఉంది. క్రింద యివతలగా ఓ చిన్న పీట మీద భగవద్గీత, తాపళాలు తదితర పూజసామగ్రులు ఉన్నయ్.

"అప్పుడు అర్థం చేసుకున్నా పరిస్థితంతా!

నెలబట్టీ, ఈ పూజా పునస్కారాలు, చన్నీళ్ల స్నానమూ, నేలమీద గుడ్డ పరుచుకునే నిద్ర పోవటమూ, భగవద్గీత పారాయణ.... ఏమిటో అంతా అగ మ్యంగా ఉంది. ఇన్నీ చేసి, నాచేతి కూడు. ఎవర్నయినా మంచి వంట బ్రాహ్మణ్ణి మాట్లాడతానంటే 'ఏమీ వద్దు, నువ్వు చాలు నాకు' అని అన్నారు! అనంది నర్సమ్మ.

"ఇంతకీ నువ్వేకులం నర్సమ్మా!" ఆ మాటడిగే సరికి, అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

"కాసేపుండి, నే బయటి కెళ్తుంటే మీ నాన్నగారే ఎదురొచ్చారు. మొహాన ఆంజనేయస్వామి సింధూరం, చెవుల్లో పూలు, మెళ్లో రుద్రాక్షమాల, మనిషి బాగా చిక్కిపోయి ఉన్నారు. చేతిలో బాలకృష్ణుని బొమ్మ చూపించి "ఎలా వుంది?" అనడిగారు.

బాగానే ఉంది.

చూడు! ఈ బొమ్మే యింత అందంగా, బావుందే ముద్దొస్తూ! నిజంగా ఆ బాలకృష్ణుడు యింకెంత బావుండేవాడో? అలాగే ఆలోచిస్తూ, ఎటో చూస్తూ నిలబడ్డారు ఆయన!

"ఆయన్ను ప్రస్తుతం నువ్వు చూస్తే విస్తుపోతావ్! చాలా చిక్కిపొయ్యారు. బుగ్గలవ్వీ పీక్కుపొయ్యాయి. కళ్లల్లో, మాటల్లో యిదివరకున్న గాంభీర్యం, వాడితనం, అన్నీ అదృశ్యమైనాయి. ఇంతగా ఆయన ఎందుకు మార్పుకు ప్రయత్నిస్తున్నాడో అర్థంగాలేదు.

ఇదో చూడు విశ్వనాథం! మంచి ఉయ్యాలవొకటి కావాలోయ్! నీకు తెలిసినచోట ప్రయత్నించు. ఏం! మర్చిపోతావా?

ఎందుకు?

ఎందు కేమిటయ్యా! ఈ బాలకృష్ణుణ్ణి రోజు జోలపాడి నిద్రపుచ్చొద్దూ! లేకపోతే మా చిన్నతండ్రి మారాము చెయ్యడు! అని ఆ బొమ్మను ముద్దు బెట్టుకున్నారు ఆప్యాయంగా.

మీ రమణకు కొడుకు పుట్టాడు! తెలుసా?

నిజంగానా! ఒక్కసారి ఆయన కళ్లల్లో విద్యుత్తు వెలిగింది. ఒళ్లంతా, ఎందుకో ఉలికింది అంతా క్షణం.

ఎప్పుడు పుట్టాడు! నాకు చెప్పలేదేం. ఇన్నాళ్లబట్టి. ఎలా ఉంటాడు....

ఏమిటో పోదామంటే నీలు చిక్కటంలా. ఈసారైనా పోయిరావాలి. కొడుకుతో పగగాని, మనమడితో నాకేం ఉంది! ఏమంటావు?

నిజం, మనమడిని తెచ్చుకోండి.

పూరుకుంటానా ఏమిటి? వాడ్ని నా యిష్టం వచ్చినట్లు పెంచుతాను, ఏమంటావ్! వీడు ఎలాగు....నా మాట.... వినలేదుగదూ! వాణ్ణయినా జాగ్రత్తగా పెంచాలి! అయినా విశ్వనాథం! ఇంత బంగాళాలో నేనూ నర్సమ్మేనా ఉండాల్సింది! కొడుకూ, కోడలూ, పిల్లలూ అంతా కళ కళ లాడుతూ ఉండాల్సింది పోయి. ఏమిటీ నిశ్శబ్దం! పిడిరాళ్లలా యిద్దరం! రవణకు మటుకు యింత ఆస్తి ఉండి, వెధవ అణాకానీ ఉద్యోగం చెయ్యాల్సిన అగత్యమేమిటి? నామాట వినలేదు గానీ, ఏ కలెక్టర్నో, డైరెక్టర్నో చెయ్యకపొయ్యానా?

జరిగిందేదో జరిగిపోయింది. యిహనైనా అంతా ఒకచోట ఉండండి!

నాకూ అలానే అనిపిస్తుంది విశ్వం! నాకు మటుకు కొడుకు, కోడలు హాయిగా తిరుగుతుంటే చూడాలని లేదూ! అది పోతూ, పోతూ నాచేత ఒట్టు కూడా వేయించుకుంది, "వాడికి ఏ కష్టం రాకుండా పెంచుతాదు గదూ।.... యిహ అన్నీ మీరే!....మరో భార్యని మీరు తెచ్చుకున్నా వాడిని మాత్రం కష్టపెట్టకండి అదే కావాల్సింది నాకు. నామాట కాదనకండి ఎన్ని జన్మలెత్తినా, ఏ లోకాన ఉన్న, మీ సాన్నిహిత్యాన్ని మీతో గడిపిన రోజుల్ని మర్చిపోలేను. అని అంది విశ్వం! కానీ యిచ్చిన మాట దక్కించుకోలేక పోయినా। కనీసం వాడు మాత్రం నా సంగతి తెలుసుగా, తెలిసీ తొందర పడట మెందుకు చెప్పు।

ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే, నీకు యీ విషయాలన్నీ తెలియవు. ఎంతగా ఆయన హృదయం క్షోభపడి నలిగిపోతున్నదో తెలియ చెప్పటానికి। ఆయన చేసే పూజలూ, స్నానాలు, ప్రతిచర్య, నీ నుంచి ఆశించిన సౌఖ్యానికి

కలిగిన నిరాశను కప్పిపుచ్చుకోటానికే. నీ ఆ చర్యవల్ల తనకేం నష్టంలేదనీ, తెలియజెయ్యాలని లోకానికీ మనసులో మండే ఆశను నిరాశను ఈ విధంగా ధాచుకుంటున్నాడు. కానీ ఆ ముసలి గుండెలో నీకోసం ప్రతిభాగం తపించి పోతున్నది ఇలాగే కొన్ని రోజులు గడిస్తే పరిస్థితు లెంత విషమంగా మారు తాయో వూహించలేను....

ఇదీ విశ్వం ఉత్తరం.

ఉత్తరంలోని విషయాలు, జీవితంలోని సంఘటనలు అన్నీ ఒక్కసారి పర్యాలోకనం చేసుకుంటే చాలా ఆశ్చర్యకరంగా అవుపడ్డవి రమణకు.

చాలా చిన్న విషయాల మీద తండ్రి, కొడుకులు, అనుబంధాలు. ఆత్మీయత తెంపుకుని వేరై పోవటం ఆశ్చర్యమే. కానీ ఆ పశ్చాత్తాపం మూడు సంవత్సరాలక్కానీ అనుభవంలోకి రాలేదు.

ఆ పూట ఆఫీసుకి సెలవు వ్రాసి, భార్య యామినిని, కొడుకును తీసుకు బయలుదేరాడు తండ్రి దగ్గరకు.

దారిలో కూడా ఆలోచిస్తూనే ఉన్నాడు రమణ, తమ యిద్దరి మధ్యగల వైరుధ్యానికీ గల కారణాలు.

యామినిని రమణ ప్రేమించాడు. యిది లోకానికి తెలిసిన యాథార్థం!

యామిని తండ్రి జూదరి, త్రాగుబోతూ, పైగా దొంగ కూడా! పేరు వీర్రాజు.

వీర్రాజు, వెంకటరత్నం గారలు దూరపు బంధువులు, అంతకుమించి స్నేహితులు.

కానీ ఆ స్నేహం, ఆ బంధుత్వం, ఒకానొక సందర్భంలో అక్కరకు రాలా!

వీర్రాజు భార్య, భర్త దురలవాట్లకు, చెడునడతకు బాధపడ్డది. సహించి నన్నాళ్లు, సహించి వూరుకుంది.

జీవనం సాఫీగా జరగటమే కష్టంగా ఉన్న గడ్డురోజుల్లో భర్త దుబారా ఆపటానికి ఆమె ప్రథమయత్నంగా వెంకటరత్నగారి సహాయాన్ని అర్థించింది.

వెంకటరత్నంగారు మిత్రుణ్ణి హితుడిగా, స్నేహితుడిగా చెప్పిచూశాడు. ఫలితం నాస్తి. ఆఖరియత్నంగా అధికారపు హోదాతో వీర్రాజుగారిని జూద రిగా పట్టుకున్నారు.

"మానం, అభిమానం ఉన్నవాడికి యింతకన్నా అప్రతిష్ఠ లేదు రాజూ! మనిషి, మర్యాదగా, మంచిగా బ్రతికితేనే మానవజన్మ సార్థకం. చూడూ, ఈ వెధవ పనులవల్ల లోకంచూపులో చులకనగావటం, తప్ప ఫలిత మేముం టుంది? ఇప్పటికైనా సక్రమంగా నడుస్తానంటే విడుదల చేయిస్తాను. లేదా, నా బాధ్యత విషయంలో బంధుత్వానికి! స్నేహానికి విలువ వుండదు."

అని వెంకటరత్నంగారు హితబోధ చేశారు. వీర్రాజు ఏమి మాట్లాడలేదు. నిశ్చలంగా నిలబడ్డాడు. మౌనాన్ని అంగీకారంగా యెంచి వీర్రాజును విడు దలచేయటం జరిగింది.

కానీ నిజంగా వీర్రాజు హృదయం, పరివర్తన పశ్చాత్తాప్తత చెందలేదు. అభిమానం ఆవేశం ప్రతీకారవాంఛ చెలరేగినయ్! తనకున్న అధికారాన్ని ఈ విధంగా తనమీద ప్రయోగిస్తున్నాడనే దురూహకలగటం జరిగింది. ఫలితంగా, ఇంటికి వెళ్లిందే తడవుగా, భార్యను చితకతన్నాడు. నెలలు నిండిన ఆ మాతృ మూర్తి, నిలువునా కూలి ప్రాణాలు విడిచింది,

ఆ దృశ్యం చూసి వెంకటరత్నం చలించాడు. నిండు గర్భవతి ఒక దుర్మార్గుడి దౌష్ట్యానికి బలైపోయింది. చిక్కి, శల్యావశిష్టమైన ఆమె మరణం చూస్తే దేహం కంపించిపోయింది, చూచిన జనానికి.

ఇదంతా జరిగిన నెలరోజులకు వీర్రాజు యావజ్జీవిత ఖైదీ కావటం, యామిని బోర్డింగ్ స్కూల్లో జేరటం జరిగింది.

ఇదంతా యామిని చిన్నతనంలో జరిగింది. అప్పటికి రమణకు పదేళ్లు, చూచాయగా అన్నీ జ్ఞాపకమే.

యామినిని ప్రేమించి మనసిచ్చాడు రమణ. యామిని వాళ్ల కుటుంబమంటే ఒక విధమైన సానుభూతి ఉంది రమణకు. అది, జాలిగాదూ, అభిమానమంత కన్నా గాదు, తల్లీ, తండ్రీ లేని అనాధ యామిని. తల్లి దారుణంగా చని పోయింది. తండ్రి ఖైదులో ఉన్నాడు. అందుకనే రమణకు యామినిమీద సానుభూతి కలిగింది.

అక్కడ ప్రారంభమైంది తండ్రి కొడుకుల మధ్య మనస్పర్థ.

అర్థమైనవాడి కూతుర్ని ప్రేమించటమేనా? అదేం కుదరదు. నే చూసి నాకు నచ్చి చేసుకోమన్న పిల్లని తప్ప, చేసుకోటానికి వీల్లేదు." వెంకట రత్నంగారు గర్జించారు.

యామినిని తప్ప మరొకర్ని ఈ జన్మలో చేసుకోను.

అయితే నీ యిష్టం. ఆ పెళ్లితో నీకూ నాకు సంబంధమూ తెగిపోయిందని మాత్రం తెలుసుకో.

వెంకటరత్నంగారు అలాగని వెళ్లిపోయారు అక్కడ నుండి. రమణ మాత్రం, ఆలోచనలో పడిపొయ్యాడు.

వెంకటరత్నంగారు కూడా ఆలోచించారు. యామిని వీర్రాజు కూతురు అవటం తప్ప తనకు తెలిసినంతవరకు లక్షణాలు గలదే! వాడి కిష్టమైన అమ్మాయిని కోడలుగా తేవటమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. అదే మాట కొడుక్కి చెబుదామన్న భావమూ ఉంది ఆయనకు.

తీరా ఆయన కొడుకోసం వెతికేసరికి రమణ యింట్లోంచి వెళ్లిపోయ్యాడు. వెంకటరత్నంగారి అహం దెబ్బతిన్నది. తనమాట వినకుండా, తనను మంచి మార్గానికి తేకుండా, అన్నీవదులుకు వెళ్లాడన్న భావమూ, మరుక్షణం "కానీ చూద్దాం. ఎంతవరకో వీడి ఆవేశమూ" అన్న నిర్ణయానికీ వచ్చారు. అంతా విన్న విశ్వం "తొందరపడ్డావు రమణా! నిదానించి ఆయన్ను ఒప్పించాల్సింది. అంతగా కాదూ కూడదంటే ఈ పని అప్పుడే చెయాల్సింది" అన్నాడు.

"లాభంలేదు విశ్వం! ఆయన మాటకు తిరుగులేదు. ఆయన తత్వం అంతే. ఆయన పెద్దరికానికి భంగం కలిగితే సహించలేడు. ఆ ఉద్యోగమూ ఇన్నాళ్ల జీవితమూ ఆయన్నలా తయారుచేసినయ్" అన్నాడు రమణ.

"నావల్ల మీరిద్దరు వేరవటం బాగాలేదండి. ఆయన అంగీకారం తీసుకుంటే బాగుండేది" అన్న యామిని మాట, దూరలేదు

పెళ్లి దేవాలయంలో జరిగిపోయింది. విశ్వనాధం బరువు భారంనెత్తిన వేసుకు జరిపించాడు. పెళ్లి ముందు విశ్వనాథం వెంకటరత్నంగారి దగ్గర కెళ్లాడు. "జరిగింది మర్చిపోండి. ఇప్పుడు మీరు వస్తే వాడు అన్నీ మర్చేపోతాడు. అంతా సలక్షణంగా ఉంటుంది. రండి పోదాం" అని బ్రతిమిలాడాడు.

"నువ్వెళ్లు విశ్వం! కడుపున పుట్టిన బిడ్డకే లేని అభిమానం నీ కెందుకు వెళ్లు! వాడిమీద కోపమూ లేదు, అభిమానమూ లేదు, నాకు. కొడుకనే బంధాన్ని ఎప్పుడో త్రెంపుకున్నా!" కళ్లు తుడుచుకున్నారు వెంకటరత్నంగారు.

"పెద్దవారు. మీరు అలా అంటే ఎలా! ఎన్ని జరిగినా వాడు మీ కొడుకు కాకపోతాడా?"

"ఆస్థికి మాత్రమే కొడుకు!"

విశ్వనాథం మారు మాట్లాడలేక పోయినాడు. అలా గడిచి పోయింది, రమణ వివాహం.

వెంకటరత్నంగారి ప్రవర్తన గమనించిన రమణ మరే అనుబంధమూ పెట్టుకోదలచుకోలా తండ్రితో! ప్రయత్నించీ, ఫలితం లేదని అతని వూహ. ఇదంతా కళ్లముంధు మెదిలింది, వెంకటరమణకు.

"లేవండి, స్టేషనొచ్చింది. ఏమిటో ఆలోచిస్తున్నారు" యామిని మాటలకు ఉలిక్కిపడి బండి దిగాడు.

ముందు కబురు చెయ్యకపోవటంవల్ల స్టేషనుకు విశ్వనాథం రాలేదు.

వెంకటరత్నంగారు పూజ ముగించుకొని అన్నీ సర్దుకుని గుళ్లోకి పోయే ప్రయత్నంలో ఉన్నారు.

"నర్సమ్మా నే నలా దేవాలయాని కెళ్తున్నా" అని కేకేసి హాల్లో కొచ్చే సరికి ఎదుథుగా రమణ, యామినీ ఉన్నారు.

వెంకటరత్నంగారు మొదట ఆశ్చర్యపోయినారు కల గాదుగదా అన్న అనుమానమూ వచ్చింది. దేదీప్యమానంగా వెలుగుతూన్న లైట్ల ముందు కల అన్న అనుమానం కలగా అనిపించింది.

క్షణం తండ్రీకొడుకులు ఒకర్నొకరు అలాగే రెప్పవాల్చకుండా చూసు కున్నారు.

ఇద్దరి మనసులు ఆర్ద్రమైనాయి.

యామిని యిద్దర్నీ చూస్తూ నిలబడ్డది.

"అరెరె! యిదేనా రావటం రమణా! రారా! అలానే నిలబడ్డావేం. పద మేడమీదికి.... మిమ్మ ల్నే, అలా నిలబడ్డారేం, మనవడ్ని అందుకోక" అని

నర్సమ్మ అనేదాకా అలానే ఉన్నారంతా.

యామిని మామగారికి పిల్లవాణ్ణి అందించి మామగారి పాదాలకు నమస్కరించి "మా తప్పులుంటే క్షమించండి" అనంది.

రమణ తలొంచుకు నిలబడ్డాడు.

వెంకటరత్నంగారు ఏదో అనబొయ్యేసరికి చంకలో మనవడు తమాషాగా ఉన్న మీసాలు కటిక్కిన లాగాడు.

"అమ్మా!....ఉండరాబాబూ! ఆ మీసాల పని అయిపోయింది. తీసేస్తాలే!" అని గుండెల కద్దుకున్నాడు.

"అలాగే ఏం కుదరదు. తీరా మనవడు వచ్చింతర్వాత అవి తీసేయిస్తానంటే ఏలా? వాడేంబెట్టి ఆడుకుంటాడు?" అన్న నర్సమ్మ మాటలకు అంతా నవ్వుకున్నారు.

పునస్సమాగమం యింత శుభంగా జరిగినందుకు అంతా సంతోషించారు.

ఆ మర్రోజు విశ్వనాథం షాపులో కూర్చోనున్నాడు. రమణ కూడా ప్రక్కనే ఉన్నాడు.

"అయితే ఉద్యోగమునకు రాజీనామా యివ్వటం ఖాయమేగా!"

"తప్పదులా ఉంది. ఆయన యిక్కడే ఉండమంటున్నాడు! తెలుసుగా, ఆయనమాట కాదంటే మళ్ళ అదొక పేచీ.

"అంతే!"

ఇంతలో షాపు కుర్రాడు విశ్వనాథానికి వో చీటి అందించాడు. అది చూడంగానే "అరేయ్! ఆయనున్నాడేమో చూడు పద!" అని కుర్రాణ్ణి పురమాయించి విశ్వం వీధిలో కొచ్చాడు. అటూ యిటూ చూశాడు. వెతుకుతున్న మనిషి కనుపించలేదు.

"ఏమిటిరా! ఎవరొచ్చారు!" రమణ కూడా బయటకొచ్చి అడిగాడు.

విశ్వం రమణ కళ్లల్లోకి చూసి చీటీ చేతికిచ్చాడు.

"విశ్వనాథం గారికి!"

నేను ఎవరో మీకు తెలియకపోవచ్చు. యామిని నా కూతురు. ఆదరించి నా పిల్లను కోడల్ని చేసుకున్నారుట వెంకటరత్నంగారు. వారి దయకు సర్వదా కృతజ్ఞుణ్ణి. దూరంగా ఉండి వాళ్లను చూసి వచ్చాను. అంతకు మించి అదృష్టం నాకు లేదు. ఈ సంగతి వాళ్లకు చెప్పండి. ముఖ్యంగా మా అమ్మాయికి! ఇహ నా కోసం వెతకొద్దు! వీర్రాజు ★

(ఆంధ్రసచిత్ర వారపత్రిక 24—5—61)